


నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఎన్విరాన్‌మెంట్ అండ్ హెరిటేజ్ యాక్టివిస్ట్ మహ్మద్ అబిద్ అలీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ గార్డెన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని.. సమగ్ర సుందరీకరణ ప్రాజెక్ట్‌ను చేపట్టాలని కోరుతూ.. ఆదివారం పార్కులో ప్రకృతి ప్రేమికులు, వాకర్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. -అబిడ్స్, మార్చి 3



మిలీనియం స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో కొనసాగుతున్న మెట్రో పనులు

## మెట్రో రెండో దశ కోసం..

# భూసార పరీక్షలు

### క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులు

### మరో రెండు నెలల్లో డీపీఆర్ రూపకల్పన

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రెండో దశ మెట్రో పనులు క్షేత్ర స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఆధ్వర్యంలో రెండు ప్రైవేటు కన్సల్టెన్సీలు 70 కి.మీ మేర ప్రతిపాదించిన మార్గాల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు అవసరమైన పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 7 మార్గాలను ప్రాథమికంగా ఖరారు చేయడంతో, ఆయా మార్గాల్లో ట్రాఫిక్ సర్వేతో పాటు భూ సార పరీక్షలను ఏక కాలంలో చేపట్టారు. రెండు మూడు రోజులుగా మియాపూర్ నుంచి పటాన్‌చెరూ వరకు నిర్ణయించిన మార్గంలో రోడ్డు మధ్య డ్రిల్లింగ్ యంత్రాలతో నేల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. హైదరాబాద్-ముంబై జాతీయ రహదారిపై ఉన్న చందానగర్, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల్లో పలు చోట్ల రోడ్డు మధ్యలో నేల స్వభావాన్ని తెలుసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొదటి దశలో మియాపూర్ వరకు మెట్రో కనెక్టివిటీ ఉండటంతో దానికి అనుసంధానంగా బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరూ వరకు సుమారు 8 కి.మీ మేర రెండో దశలో మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఈ మార్గంలో రోడ్డు విశాలంగా ఉండటంతో భూసేకరణ అవసరం లేకుండా మెట్రో వయాడక్ట్‌ను రోడ్డు మధ్యలోంచే నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నదని మెట్రో ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఇదే తరహాలో మిగిలిన ప్రతిపాదిత కారిడార్లలో డీపీఆర్ రూపొందించేందుకు అవసరమైన పనులను క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నామని, రెండు నెలల్లో డీపీఆర్‌ను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు.



# రద్దీ ఉన్నా.. బోగీలు పెంచరా?

మూడు నిమిషాలకో సర్వీసు..

కిక్కిరిస్తున్న రైళ్లు

### మరిన్ని కోచ్‌లు జతచేయాలంటున్న ప్రయాణికులు

### మెట్రో ఎండీ సూచించినా.. పట్టించుకోని ఎల్ అండ్ టీ

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మెట్రో ప్రయాణం కిక్కిరిసిపోతున్నది. రద్దీకి అనుగుణంగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మెట్రో సేవలు ప్రారంభమైన ఆరేండ్లలో ఒకేరోజు 5.47 లక్షల మంది రాకపోకలు సాగించడం వంటి రికార్డు నమోదైనా.. అధికారులు రద్దీకి తగ్గట్టుగా..అదనపు కోచ్‌లు జత చేయడంపై దృష్టి పెట్టడం లేదు. ఏకంగా మెట్రో ఎండీ అదనపు కోచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని అనేక సార్లు సూచించినా.. పట్టించుకోవడం లేదు.

#### 2-3 లక్షల మంది ఐటీ ఉద్యోగులు..

ముఖ్యంగా కరోనాతో ఐటీ రంగంలో ప్రవేశ పెట్టిన వర్క్ ఫ్రమ్ హోం విధానం మెట్రోపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ తర్వాత క్రమంగా మెట్రో రైళ్లలో రద్దీ పెరుగుతుండడంతో దానికి అనుగుణంగా అదనపు కోచ్‌లను జతచేయాల్సి ఉన్నా.. ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఐటీ ఉద్యోగులు 10లక్షలకు పైగానే నగరంలో నివాసం ఉంటున్నారు. అధిక శాతం నగరానికి పడమర దిక్కునే 95 శాతం ఐటీ కారిడార్ విస్తరించి ఉంది. మెట్రోలోనే నిత్యం 2-3 లక్షల మంది ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం క్రమంగా తగ్గుతూ ఉండటంతో ఆఫీసుకు వచ్చే ఐటీ ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైళ్లతో మూడు మార్గాల్లో నడుపుతున్నా, అవి రద్దీ సమయాల్లో ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో అదనపు కోచ్‌లు పెంచాలన్న డిమాండ్ పెరుగుతున్నది. మొత్తం మెట్రో రైళ్లు మూడు కోచ్‌లతో కూడినవి 57 వరకు ఉన్నాయి. ప్రతి రోజూ మూడు కారిడార్‌లలో అవసరాన్ని బట్టి ప్రతి 3 నిమిషాలకో రైళ్లను నడుపుతున్నారు. అయినా అవి ఏ మాత్రం సరిపోవడం లేదు.

#### అదనపు కోచ్‌లు జత చేయాలన్నా..

ప్రస్తుతం ఉన్న ఒక్కో మెట్రో రైలులో ఒకేసారి 1000-1200 మంది వరకు మాత్రమే ప్రయాణించే అవకాశం ఉంది. రద్దీ సమస్యను అధిగమించేందుకు ఎల్ అండ్‌టీ మెట్రో అధికారులు ఏ చర్యలూ తీసుకోవడం లేదు. మెట్రో రైళ్లలో రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఎల్ అండ్ టీ మెట్రో అధికారులకు అదనపు కోచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని అనేక సార్లు సూచించినా..పట్టించుకోలేదు.

## మాట ఇచ్చి..

# సందడి చేసి..

### మిలీనియం స్కూల్ విద్యార్థుల ఆహ్వానానికి కేటీఆర్ ఫిదా

### వార్షికోత్సవానికి హాజరై చిన్నారులతో ముచ్చటించిన తారక రాముడు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాజేంద్రనగర్‌లోని మిలీనియం స్కూల్‌కు చెందిన కొందరు విద్యార్థులు తమ స్కూల్ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఓ చిన్న వీడియో రూపొందించి.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్) ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆ పోస్ట్‌కి స్పందించిన కేటీఆర్.. 'నాకు షెడ్యూల్‌లో ఇతర కార్యక్రమాలు ఉన్నా..మీ కోసం.. కొంత సమయాన్ని తీసుకొని.. వస్తా.. మీ ఆహ్వానం అంత బాగా నచ్చింది' అంటూ సమాధానమిచ్చారు. ఇప్పటి వరకు తనకు అనేక కార్యక్రమాలకు హాజరు కావాలని ఆహ్వానాలు అందాయని, కానీ ఇంత అద్భుతంగా (క్యూట్‌గా) ఆహ్వానం అందడం ఇదేనంటూ.. కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మిలీనియం స్కూల్ వార్షికోత్సవానికి హాజరయ్యారు. తనకు ప్రత్యేకంగా ఆహ్వానం పంపిన చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఆ తర్వాత స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడి వెనుతిరిగారు. విద్యార్థుల కోరికను మన్నించి కార్యక్రమానికి హాజరు కావడంపై స్కూల్ యాజమాన్యంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకొని తమ సంతోషాన్ని పంచుకున్నారు.



సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్(ఫైల్)

# బోసిపోతున్న చెరువులు

### సుందరీకరణ పట్టని బల్దియా

### కమిషనర్ ఆదేశించినా.. పురోగతిలో లేని పనులు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): చెరువులను కాపాడి పరిసరాలను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ సుందరీకరణ పనులను అటకెక్కిస్తోంది. చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్ పనులు ముందుకు కదలడం లేదు. పైగా ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు భారీ వచ్చి చేరి.. చెరువులన్నీ కంపుకొడుతున్నాయి. చెరువు సుందరీకరణ పనులు నిలిచిపోవడం పట్ల బల్దియాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో తొలి విడతగా 20 చెరువులను గత కేసీఆర్ ప్రభుత్వం సుందరీకరణ పనులను రూ. 271.33 కోట్లతో చేపట్టింది. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక గడిచిన మూడు నెలలుగా చెరువుల సుందరీకరణ పనులు ఏ మాత్రం ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్‌లలో కమిషనర్ రోనాల్డ్ రాస్ పలు చెరువుల సుందరీకరణ పనులను పరిశీలించారు. ఫెన్సింగ్, చెరువు క్లీనింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు చెరువుల వద్ద మురుగు మళ్లింపు ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. అయినా పనులు ముందుకు సాగడం లేదు.

## ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా సోమవారం బేగంపేట్ నుంచి సోమాజిగూడ వరకు అరగంట పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రాత్రి 7.40 నుంచి 8.10 నిమిషాల మధ్య బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి షాపర్ స్టాప్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రాజ్‌భవన్ వరకు , అలాగే 5వ తేదీ ఉదయం 9.50 నుంచి 10.15 నిమిషాల మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్టు వరకు ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. ఇక ఎల్బీస్టేడియంలో నేడు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి ప్రభుత్వం నియామక పత్రాలు అందజేయనున్న నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



## మార్చిలోనే మాడు పగిలేలా..!

*నగరంలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నెల మొదటివారంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. 40కి చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. ఆదివారం సిటీలో మధ్యాహ్నం వేళ..జనసంచారం లేక బోసిపోయిన రోడ్డును చిత్రంలో చూడొచ్చు.*



## మాదకద్రవ్యాల నిర్మూలనకు

# పాఠశాలల్లో కమిటీలు

### విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

### డ్రగ్స్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

### నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ నిర్మూలనకు పాఠశాలల్లో కమిటీలు వేస్తామని, వాటికి త్వరలోనే పేరును నిర్ణయిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 'డ్రగ్స్ ఫ్రీ హైదరాబాద్' పేరుతో మాదకద్రవ్యాల నిర్మూలనపై హైదరాబాద్ పోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ ఆడిటోరియంలో స్కూల్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణను మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు అంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నిరోధించడం ఒక పోలీసుల బాధ్యత మాత్రమే కాదని..ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. 'పాఠశాలలు, కాలేజీల వరకు డ్రగ్స్ మహమ్మారి చేరుకుంది..ఇది మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి' అని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి మాట్లాడుతూ మానవ సమాజానికి డ్రగ్స్ అనేది అత్యంత ప్రమాదకరమైందన్నారు. రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను కట్టడి చేయకపోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడే అవకాశముందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ దేవాసేన తదితరులు పాల్గొన్నారు.

> తెలంగాణను మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు అంతా కలిసికట్టుగా కృషి చేయాలి. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తాం.

GHMC

## నేడు జీహెచ్‌ఎంసీ

# ప్రజావాణి


సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి ఉంటుందని కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ప్రజావాణి సందర్భంగా హెడ్ ఆఫీస్‌లో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ 040-2322 2182 నంబర్‌కు తమ సమస్యలను తెలుపాలన్నారు. ప్రజల నుంచి విన్నపాలను స్వీకరిస్తామన్నారు. ఈ ప్రజావాణి జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కూడా ఉంటుందన్నారు.



బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎన్‌బీటీనగర్ బస్తీ దవాఖానలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ.. సుల్తాన్‌బజార్ యూపీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీలు ధరించి పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది



# తొలి రోజు 10 లక్షల మందికి పైగా..

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పోలియో చుక్కల పంపిణీ విజయవంతంగా సాగింది. తొలిరోజు 10 లక్షల మందికి పైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఐదేండ్లలోపు పిల్లలు మొత్తం 5,06,930మంది చిన్నారులు ఉండగా, వారికి పోలియో చుక్కల పంపిణీ కోసం 2800 పోలియో బూత్‌లు, 85 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11,200 మంది సిబ్బంది విధులు నిర్వర్తించారని, అదనంగా 79మొబైల్ టీమ్స్ కూడా చుక్కల పంపిణీ విధుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 4.1 లక్షల మందికి పోలియో చుక్కలు వేసినట్లు వెల్లడించారు. పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు 4,5,6 తేదీల్లో ఇండ్ల వద్దే వేయనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 4,9,038మంది చిన్నారులు ఉండగా వారిలో 95శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 80శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు వివరించారు.